# రైతు బంధు జీవిత బీమా పథకము

**ఉద్దేశము:**

ఎవరైనా రైతులు (పట్టాదారులు) మరణించినట్లయితే వారి వారసులకు ఆర్థిక ఉపశమనాన్ని కలిగించటం ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశము తెలంగాణ లో 90 శాతం మంది రైతులు 5 ఎకరాలు లేదా అంతకంటె తక్కువ భూమిని కలిగి ఉన్నటువంటి చిన్న మరియు సన్నకారు రైతులుగా ఉన్నారు. వారికి కేవలం వ్యవసాయమే ఏకైక జీవనోపాధిగా ఉన్నది. అట్టి రైతు కుటుంబంలో ఆర్జించే వ్యక్తి మరణించినట్లయితే, అతని/ఆమె కుటుంబ సభ్యులు తమ దైనందిన అవసరాలకు ఆర్థిక సమస్యలలో చిక్కుకొని పోతారు.

కావున, మరణించిన రైతు యొక్క కుటుంబ సభ్యులకు ఖచ్చితంగా ఆర్థిక సుస్థిరత లభించేలా రైతుల జీవిత బీమా పథకమును అమలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

- తెలంగాణ రాష్ట్రంలోని యావన్మంది పట్టాదారు రైతులకు "రైతు బంధు జీవిత బీమా పథకమును" ప్రభుత్వము ప్రకటించినది.
- ఈమధ్యనే పూర్తి చేయబడిన భూమి రికార్డుల నవీకరణ దరిమిలా జారీ చేయబడిన పట్టాదారు పాసుపుస్తకములు కలిగిన వారందరు ఈ పథకమునకు అర్హులు అవుతారు.
- 18 - 59 సంవత్సరాల వయస్సు కలిగిన రైతులకు ఈ జీవిత బీమా పథకము వర్తింపచేయబడుతుంది
- ఎకారణంచేతనైనా సదరు రైతు మరణించినట్లయితే రూ.5.00 లక్షలు బీమా సొమ్ము చెల్లించబడుతుంది.
- ఈ పథకము 2018 ఆగస్టు 15వతేదీ నుండి 2019 సంవత్సరం ఆగస్టు 14వ తేదీ వరకు అనగా ఒక పూర్తి సంవత్సర కాలం అమలులో ఉంటుంది మరియు వార్షిక ప్రాతిపదికన పునరుద్ధరించబడుతుంది.
- రైతుల జీవిత భీమా పథకము భారతీయ జీవిత బీమా సంస్థచే(ఎల్.ఐ.సి.) అమలు చేయబడుతుంది.
- భారతీయ జీవిత భీమా సంస్థ ప్రభుత్వ రంగ సంస్థ మరియు ఈ సంస్థ మాత్రమే, సామూహిక జీవిత భీమా పథకము అమలు పరుస్తున్నది.
- భీమా పరిహారము చెల్లింపులో సంస్థకు గల అనుభవము దృష్ట్యా మరియు ఖాతాదారుల యొక్క నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి స్వీయ పాలన గల ఏకైక సంస్థ.

- ఈ పథకము ఆగస్టు 15 నుండి అమలులోనికి వస్తుంది మరియు ఇందు నిమిత్తమై జూన్ 5వ తేదీ నుండి మొదలుకొని నామినేషన్ వివరాలతో పాటుగా అర్హులైన రైతుల వివరాలను ఎ.ఇ.ఓ.లు నామినేషన్ ఫారమ్‌లలో సేకరించవలసి ఉంటుంది.

- డి.ఎ.ఓ., ఎ.డి.ఎ, ఎ.ఓ.లో పర్యవేక్షణలో ఎ.ఇ.ఓ. రైతుల యొక్క వివరాలు సేకరించబడుతుంది.

- ఒక్కొక్క సభ్యునికి సంవత్సరానికి రూ.1925/- , దీనికి 18 శాతం జి.ఎస్.టి.ని జోడిస్తూ ఇట్టి మొత్తము రూ.2271.50 ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

- వైద్య పరీక్ష ఆవశ్యకత లేదు.

- ఎ.ఇ.ఓ.లు ప్రతి ఒక్క రైతు కుటుంబాన్ని ప్రత్యక్షంగా సందర్శించి వివరాలను సేకరించి నామినేషన్ ఫారమ్‌ను నింపవలసి ఉంటుంది.

- రైతుల వయస్సు ఆధార్ కార్డులో పేర్కొనబడిన మేరకు నిర్ధారణ చేయబడుతుంది మరియు ఒకవేళ ఆధార్ కార్డులో కేవలం పుట్టిన సంవత్సరం మాత్రమే పేర్కొనబడి ఉన్నట్లయితే, డిఫాల్ట్ తేదీ అనునది అట్టి సంవత్సరం యొక్క జూలై మాసం 1వ తేదీగా పరిగణించబడుతుంది.

- పట్టా పాసుపుస్తకము కలిగి ఉన్న యావన్మంది వ్యక్తులు ఆధార్ కార్డు నెంబరును కలిగిఉండాలి. ఆధార్ కార్డు అనునది రైతు యొక్క వయస్సును నిర్ధారణ చేయుటలో దస్తావేజు ఆధారిత నిరూపణగా ఉపయోగించబడుతుంది కావున, ఒకవేళ ఎవరికైనా ఆధార్ కార్డులు లేనట్లయితే వారు వెంటనే దాని కొరకు దరఖాస్తు చేసుకోవాలి.

- ప్రతి పట్టాదారుని యొక్క ఆధార్ నెంబరు సేకరించబడి పట్టాదారు పాసు పుస్తకము వివరములను ఒక పట్టాదారుని ఒక బీమా పాలసీ చేయు నిమిత్తమై ఉపయోగించబడుతుంది.

- తన యొక్క నామినీని నిర్ధారణ చేస్తూ నామినేషన్ ఫారమ్‌పై పట్టాదారు సంతకం చేయవలసి ఉంటుంది.

- పై వివరములన్నీ సంబంధిత ఎం.ఎ.ఓ. గారి పర్యవేక్షణలో ఎ.ఇ.ఓ.లు రైతు బంధు, పోర్టల్‌లో ఎలక్ట్రానిక్ విధానంలో అప్‌డేట్ చేయవలసి ఉంటుంది.

- ఒక గ్రామానికి సంబంధించిన సభ్యుల ప్రధాన పట్టికను ఎ.ఓ సక్రమ విధానంలో డి.ఎ.ఓ. గారికి దాఖలు చేయవలసి ఉంటుంది.

- జిల్లా వారీ పట్టికలను డి.ఎ.ఓ.లు నోడల్ ఏజెన్సీగా నిర్ధారణ చేయబడిన వ్యవసాయ సంచాలకుల వారికి దాఖలు చేయవలసి ఉంటుంది.

- బీమా లో చేర్పించబడిన రైతులందరి వివరములు రైతు బంధు పోర్టల్‌లో లో అప్‌డేట్ చేయబడి ఆ వివరములు ఎల్.ఐ.సి. వారికి అందచేయబడతాయి.

- ఈ పథకము వర్తింపులోనికి రాని నూతన పట్టాదారు పాస్ బుక్ కలిగిన రైతుల తదనంతరం ప్రవేశం పొందుతారు. ఆవిధంగా తరువాత కాలంలో ప్రవేశం పొందిన వారి పట్టిక మాసం ప్రాతిపదికన నోడల్ ఏజెన్సీ వారిచే ఎల్.ఐ.సి.కి అందచేయబడుతుంది. ఈ అదనపు సభ్యులకు సంబంధించి ప్రీమియం సొమ్ము త్రైమాసికం ప్రాతిపదికన చెల్లించబడుతుంది.

- పథకములో చేర్చబడు ప్రతి ఒక్క పట్టాదారునకు ఒక బీమా సర్టిఫికేట్‌ను ఎల్.ఐ.సి. జారీ చేస్తుంది.

- బీమా సర్టిఫికేట్ల పంపిణీ 2018 ఆగస్టు 15వ తేదీ మొదలుకొని ఆరంభం అవుతుంది.

**<u>క్లెయిమ్‌ల పరిష్కారము:</u>**

- చేర్చబడిన పట్టాదారు గనుక మరణించినట్లయితే, నామినీ యొక్క బ్యాంక్ ఖాతా వివరాలతో (తప్పనిసరి) సహా క్లెయిమ్ ఫారమ్‌ను మరియు సమర్థత కలిగిన అధికారిచే జారీ చేయబడు మరణ ధృవీకరణ పత్రమును ఎ.ఇ.ఓ.గారు సేకరించాలి. మరణ ధృవీకరణ పత్రముతో పాటుగా క్లెయిమ్ ఫారమ్‌ను సదరు ఎ.ఇ.ఓ. గారు రైతు బంధు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది.

- బీమా క్లెయిమ్ పరిష్కరించబడి క్లెయిమ్ ఫారమ్ ఆధారంగా సొమ్ము చెల్లించబడుతుంది. ఇట్టి సొమ్ము పట్టాదారునిచే నిర్ధారణ చేయబడిన నామినీ యొక్క ఖాతాకు కేవలం ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ చేయబడుతుంది

- మరణ ధృవీకరణ పత్రము జతచేయబడి, అన్ని విధాలుగాను సమగ్రముగా నింపబడిన క్లెయిమ్ ఫారం, అందిన తేదీ మొదలుకొని 10 దినముల లోపుగా ఎల్.ఐ.సి. వారు భీమా పరిహారము ను అందజేస్తారు.

**<u>రైతు బంధు పోర్టల్:</u>**

- రైతుల భీమాకి సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న రైతు బంధు పోర్టల్‌లో ఒక అదనపు ఫీచర్ (భాగము) ఏర్పాటు చేయబడుతుంది.

- భీమాలో చేర్చబడిన పట్టాదారు పాసు పుస్తకము కలిగిన రైతు వివరాలను ఎ.ఇ.ఓ.లు ఇట్టి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయగా, ఈ వివరాలు ఎల్.ఐ.సి. వారికి పంపబడతాయి.

- క్లెయిమ్ పరిష్కార దశను కనుగొను నిమిత్తమై రైతు బంధు జీవిత భీమా పోర్టల్‌లో ఇంటర్‌ఫేస్‌ను ఎల్.ఐ.సి. ఏర్పాటు చేస్తుంది.